## క్లుప్తంగా

### దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు


దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం పూర్ణామార్కెట్‌లో కొలువైన దుర్గాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు అమ్మ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

### కళింగులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

దాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వం కొలువు దీరిన వేళ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల మంది ఉన్న కళింగ సామాజిక వర్గానికి మంత్రి పదవి కేటాయించకపోవడం బాధాకరమని కళింగ సంక్షేమ సమితి అధ్యక్షుడు కేవీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళింగులకు తగిన ప్రాధాన్యత కల్పించి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నామన్నారు. విశాఖలో లక్ష ఓట్లు, విజయనగరంలో 15 వేల ఓట్లు వున్నాయని, నెల్లూరులో ఇద్దరు కళింగ నేతల సహకారంతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో కళింగులు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. సమావేశంలో పొందూరు సత్యనారాయణ, డాక్టర్ వెంకట్, న్యాయవాది నరసింహస్వామి, ఎంవీ రమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక రాజధానిగా విశాఖ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం : విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రభుత్వం అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలుపుతుందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణం చేసి, 5 హామీలపై సంతకాలు చేసిన సందర్భంగా ఆయన స్థానిక కృష్ణగార్డెన్స్‌లో గల క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దక్షిణ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ప్రతి లబ్ధిదారునికి సంక్షేమం అందేలా ప్రజల వద్దకే పాలన నినాదంతో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

### రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం


నేత్ర వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్ : ఈ నెల 16న పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని స్థానికులు వినియోగించుకోవాలని ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. ఈ మేరకు నగరంలో గల ఏఎన్ బీచ్ ఆస్పత్రిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్, పిల్లల వైద్య నిపుణుడు ముస్తాఫ్ అహ్మద్ మాట్లాడుతూ అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వై. రాజు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# అందంగా.. ఆహ్లాదంగా

కంచరపాలెం.. జ్ఞానాపురం.. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ప్రాంతాలు గతంలో అధ్వానంగా ఉండేవి. చీకటి పడితే అటు ప్రయాణించేందుకు ఎవరూ సాహించేవారు కాదు. కానీ ఇటీవల ఇక్కడి రహదారులు.. ఫుట్‌పాత్‌లను ఆధునికీకరించడంతో వాహన చోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారుల్లో ఇప్పుడు సులువుగా ప్రయాణించగలుగుతున్నామని చెబుతున్నారు.

**సుందరీకరణకు చేపట్టిన పనులు.. వినియోగించిన నిధులు**

| పనులు | నిధులు |
|---|---|
| బీటీ రోడ్లు | రూ. 45.82 లక్షలు |
| ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు | రూ. 19.21 లక్షలు |
| ఫుట్‌పాత్‌లకు టైల్స్ | రూ. 23.65 లక్షలు |
| ఫుట్‌పాత్‌లకు రంగులు | రూ. 18.50 లక్షలు |


ఎఫ్‌సీఐ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌కు మెరుగులు దిద్దుతున్న కార్మికులు


సుందరంగా మారిన ఫుట్‌పాత్

- రహదారులు.. ఫుట్‌పాత్‌ల సుందరీకరణ
- జ్ఞానాపురం రైల్వేస్టేషన్.. ఎఫ్‌సీఐ రహదారులకు నూతన శోభ
- హర్షం వ్యక్తం చేస్తున్న పాదచారులు.. వాహన చోదకులు


శిథిలమైన జ్ఞానాపురంలోని ఫుట్‌పాత్ (ఫైల్)


ఫుట్‌పాత్ ఆధునికీకరణ పనులు (ఫైల్)

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలి నుంచి కాన్వెంట్ జంక్షన్, అటు కంచరపాలెం ఫ్లైఓవర్ వరకు రహదారులు సుందరంగా తీర్చిదిద్దటంతో పాదచారులు, వాహన చోదకులు సులువుగా ప్రయాణం చేస్తున్నారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారులకు జీవీఎంసీ రూ. 1.07 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో రహదారులకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా ఫుట్‌పాత్‌లు, బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో అంతటా అభివృద్ధి కానవస్తోంది. పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లపై టైల్స్, జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేశారు. చక్కటి రంగులు వేసి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. ఇక్కడ గతంలో లేని అభివృద్ధి 2019 నుంచి 2024 వరకు జరిగింది. రహదారులు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ లైట్ల ఏర్పాటుతో పాదచారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నిధులు మంజూరు చేయించుకుని వార్డును అభివృద్ధి చేశారు. మరో రెండేళ్లలో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కంచరపాలెం మీదుగా ఎఫ్‌సీఐ, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, కాన్వెంటు కూడలి వైపు ప్రయాణం చేసే ప్రజలు ఇబ్బందులు తొలిగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**వార్డు అభివృద్ధికి మరింత కృషి..**



వార్డులో జరిగిన అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారు. జీవీఎంసీ మేయర్, కమిషనర్ కృషితో నిధులు త్వరగా మంజూరు కావడంతో గత ఏడాది అక్టోబర్‌లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయగలిగాం. విద్యుత్ స్తంభాలు, ఫుట్‌పాత్‌లపై సిమెంట్ పలకల ఏర్పాటు పనులు పూర్తి చేశాం. వార్డును పరిశుభ్రంగా చూసుకునే బాధ్యత అందరిపై ఉంది. రానున్న కార్పొరేషన్ ఎన్నికల నాటికి వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.
– కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు కార్పొరేటర్

## కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..**

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.

## రెల్లివీధిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం


కార్యక్రమ నిర్వహణను పరిశీలిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు


ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ వైద్య విద్యార్థులు

మహారాణిపేట : మహారాణిపేట, రెల్లివీధి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు రక్తపరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త హీనతతో పాటు వివిధ వ్యాధుల గురించి జూనియర్ వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. సుమారు 500 కుటుంబాలకు సంబంధించిన వ్యక్తులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. క్యాంపులో భాగంగా రక్తదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సామాజిక వైద్య విభాగం అధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ పీజే శ్రీనివాస్, డాక్టర్ ఎం. కళ్యాణి, అధ్యాపకులు, జూనియర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి శ్రీ సాగరదుర్గ అమ్మవారి వార్షికోత్సవాలు

అల్లిపురం : బీచ్‌రోడ్డు వెంకటేశ్వరనగర్‌లో కొలువ దీరిన శ్రీ సాగర దుర్గమ్మ వారి వార్షిక మహోత్సవాలను ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బీచ్ రమణ, రాజా, చిడం రాము, మజ్జి శ్రీను తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనాలని వారు కోరారు.

## స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగం చేసైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 1141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అలాగే విశాఖ ఎంపీతో పాటు శాసనసభ్యులందరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో రక్తదాన శిబిరం


కేజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న దాత

మహారాణిపేట : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేజీహెచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇక్కడి బ్లడ్ బ్యాంక్‌లో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వైద్య విద్యార్థులు, గైనిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు రక్తదానం చేశారు. ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్, ఎన్ఎస్ఎస్ యూనిట్‌తో పాటు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జి పాథాలజిస్ట్, పారా మెడికల్ టీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## దేవస్థానం పాఠశాలలో సకల సౌకర్యాలు

- ఈవో శ్రీనివాసమూర్తి
- విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల ఆవరణలోనే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ రాంబాబును ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఈవో సందర్శించారు. 1994–95,2002–03 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు మాస్టర్ ఈకే స్పిరిచ్యువల్ సేవా సంస్థలు, గొడవర్తి వంశీ అండ్ ఫ్రెండ్స్ వితరణగా అందించిన నోట్ పుస్తకాలను ఈవో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలకు ఎంతో ఘనకీర్తి ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. ముఖ్యంగా హాస్టల్ ఒకచోట, పాఠశాల మరో చోట ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రహించామన్నారు. త్వరలోనే పాఠశాల క్యాంపస్‌లోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్, ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి శాస్త్ర విద్య దోహదం

- ఆర్జేడీ విజయభాస్కర్


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనదని, జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధన అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్లు ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్ రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎంవి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# కేరాఫ్ ఫుడ్‌పాత్


రకరకాల వంటకాలతో బారులుతీరిన మొబైల్ వాహనాలు


జూ రోడ్డులో టూ వీలర్ ద్వారా తాటిబెల్లం, తాటితాండ్ర, మామిడితాండ్ర, పూతరేకుల విక్రయం


ఫాస్ట్‌ఫుడ్ మొబైల్ వాహనం

**మామూళ్ల బెడద లేదు. కరెంటు.. షాపు అద్దె లేదు. ఒకే వ్యాపారం చేయాలన్న ఒత్తిడి లేదు. నచ్చిన చోట మెచ్చిన వ్యాపారం చేసుకోవచ్చు. టిఫిన్ సెంటర్ నుంచి షర్బత్ బండి వరకూ ఏదైనా చేసుకునే వెసులుబాటు.. వినియోగదారులు మెచ్చే ఆహారం.. మొబైల్ బిజినెస్ ఇప్పుడు ఎవర్‌గ్రీన్ ట్రెండ్..**

- వినియోగదారులు కోరుకునే చోటే ఆహారం.. పానీయాలు
- పనికి ఆటంకం లేదని.. సమయం కొలిసొస్తుందంటున్న కస్టమర్లు
- ఫుడ్ ఆన్ వీల్స్‌కు చిరునామా సౌత్ జైల్‌రోడ్డు

దాబాగార్డెన్స్ : పట్టణీకరణ పెరగడంతో మనుషుల అవసరాలు, ఆలోచనల్లో కూడా చాలా మార్పులు వచ్చాయి. బిజీ బిజీ జీవనంలో ప్రతీది శుచి, శుభ్రతతో ఉన్న వస్తువులు తమ వాకిట్లోకి, లేదా తాము విధులు నిర్వహించే చోట, ఆఫీసుకు వెళ్లే మార్గంలో ఉంటే బాగుంటుంది అనుకుంటున్నారు. జీవనం యాంత్రికం అయిపోవడంతో హోటళ్లు, షాపులకు వెళ్లే సమయం చాలా మందికి దొరకడం లేదు. దీంతో వినియోగదారుల అవరాలకు తగిన విధంగా వ్యాపారులు సైతం సిద్ధం అవుతున్నారు. ఇప్పుడు మొబైల్ హోటళ్లు, షర్బత్‌లు వినియోగదారులకు ఇట్టే అందుబాటులోకి వస్తున్నాయి. చివరకు కొబ్బరి బొండాలు.. పలు రకాల పండ్లు వంటివి కూడా ఆటోల్లో అమ్మేస్తున్నారు. దీని వల్ల వినియోగదారుల చెంతకే ఆహార పదార్థాలు చౌక ధరలకు అందడం ఒక విషయమైతే.. వ్యాపారులు కూడా ఒకే చోట ఉండి అక్కడి పరిస్థితుల మీదనే ఆధారపడకుండా ఎక్కడ, ఏ సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందో అక్కడికి వెళ్లిపోతున్నారు. పైగా ఈ వాహనాల్లోని ఆహార పదార్థాలు శుచి, శుభ్రత, నాణ్యంగా ఉండటంతో వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం నగరంలో గజం స్థలం ధర చుక్కలంటడం, పైగా రోడ్డు పక్కన తోపుడు బండి పెట్టుకుందామన్నా రకరకాల ఒత్తిళ్లు, మామూళ్ల బెడద పెరిగిపోవడం, కరెంటు, షాపు అద్దెలాంటి ఇబ్బందుల వల్ల ఈ మొబైల్ వ్యాపారమే బేషుగ్గా ఉందని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు హోటళ్లకు వెళ్లి వేచి ఉండాల్సిన పని లేకుండా పనులకు వెళ్లే దారిలోనే టిఫిన్, కొబ్బరి బొండాలు, షర్బత్ వంటివి దొరుకుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారాలు జీవీఎంసీ పరిధి దక్షిణ నియోజకవర్గంలో కోకొల్లలు. సౌత్ జైల్‌రోడ్డులో ఫుడ్ ఆన్ వీల్స్ ఘుమఘుమలు పంచుతున్నాయి.

**ఫుడ్ ఆన్ వీల్స్‌కు కేరాఫ్ సౌత్ జైల్‌రోడ్డు..**

సాయంత్రమైతే చాలు.. సౌత్ జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో వందలాది బళ్లలో కోరుకునే ఆహారం దొరుకుతోంది. చేతిలో కార్డు ఉండే చాలు.. ఏం కావాలో అవి తినవచ్చు. ఏటీఎం డెబిట్/క్రెడిట్ కార్డ్స్‌తో పాటు పేటీఎం.. గూగుల్ పే.. ఇలా ఎన్నో రకాల వెసులుబాటుతో కోరింది తిని బిల్ చెల్లించుకోవచ్చు. సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ టిఫి.. నూడిల్స్.. చికెన్ జాయింట్స్.. ఫ్రైడ్ రైస్.. ఇలా అన్ని రకాల వంటకాలతో పాటు చల్లని పానీయాలు కూడా మొబైల్ వ్యాన్లలో లభిస్తున్నాయి.

## అలరించిన కూచిపూడి నృత్యం


తమ నాట్యంతో అలరించిన చిన్నారులు


నిర్వాహకులతో చిన్నారి నృత్య కళాకారిణులు

సీతమ్మధార : అత్యంత మధుర గానాలతో కూచిపూడి నృత్యం కనువిందు చేసింది. ప్రముఖ నృత్య కళాకారిణి, సిరీ డ్యాన్స్ అకాడమీ స్వర్ణ శిష్య బృందం శుక్రవారం రాత్రి దొండపర్తి రామాలయంలో దుర్గాదేవి జాతర సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారుల నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ఆలయ నిర్వాహకులు నృత్య కళాకారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. తొలుత గ్రామస్తులు దుర్గాదేవికి పూజలు చేశారు. గ్రామ పెద్దలు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్, చిరంజీవి, పాలికల సింహాచలం, గురునాథ్‌రెడ్డి, లలిత కుమారి, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, సతీష్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## లలితాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాతీయ రహదారి దరి కొలువైన లలితా అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వరాహగిరిశ్రీ లలితమ్మకు పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన, లలిత పారాయణ, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ త్వరలోనే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.